క్లుప్తంగా

గంజాయి వినియోగదారులకు కౌన్సెలింగ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కేంద్రం లో గంజాయి వినియోగిస్తున్న యువకులకు సీఐ ఎస్.వెంకటేశ్వర్లు గురువారం రాత్రి కౌన్సిలింగ్ నిర్వహించారు. యువత మత్తుప దార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యస నాల జోలికి వెళ్లొద్దన్నారు. ఆయన వెంట ఎస్సై పవన్‌కుమార్, సాయిశశాంక్ ఉన్నారు.

దసరాను వైభవంగా నిర్వహించుకుందాం..

ఏటూరునాగారం: అక్టోబర్ 2 నిర్వహించే దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకోవడానికి ప్రజలు, గ్రామస్తులు, మహిళలు, యువత సహకరించాలని దసరా ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రామాలయంలో దసరా ఉత్సవాలపై కమిటీ, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. దసరా ఉత్సవాలకు కావాల్సిన ఏర్పాట్లు, ఉత్సవాల క్రతువులపై చర్చించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. రావణవధకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థలం క్లినింగ్, జెండాల ఏర్పాట్లు, విద్యుత్ లైట్లు, తాగునీటి వసతి, బారీగేడ్స్ ఇలా అనేక విషయాలను ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవాల కమిటీ సభ్యులు తాడూరి రఘు, నూక ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం–చిన్నబోయినపల్లి మధ్య ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గంటలకుంట గ్రామానికి చెందిన ముగ్గురు గొత్తికోయలు చిన్నబోయినపల్లి నుంచి ఏటూరునాగారం వైపు వస్తుండగా పోతురాజు బోరు మలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ఎస్సై రాజ్‌కుమార్ క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాగా మద్యం మత్తులో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కాటాపూర్ లోని జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బాణాల సుధాకర్ గురువారం తెలిపారు. ఈనెల 10న జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో మూడు విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. మూగ నాటిక(డ్రామ్ మైమ్)లో సాత్విక్, కార్తీక్, అఖిల్, నిఖిల్, ప్రణయ్, సతీష్, విజువల్ ఆర్ట్స్ (డ్రాయింగ్ పోటీల్లో)లో కార్తీక్, వోకల్ మ్యూజిక్ గ్రూప్ సాంగ్ పోటీల్లో శ్రీవిద్య, అక్షిత రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు సక్రునాయక్ ,అక్బర్ బాషా, జీవన్ లాల్, సమ్మయ్య, సామ్సన్, పాపారావు, వెంకటేశ్వర్లు, రాజేశ్, జయపాల్, విజయ, శ్రీదేవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

వాజేడు: విద్యార్థులకు సమయానికి అనుకులంగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు బోదెబోయిన సాయి మాట్లాడుతూ.. మండలంలోని చింతూరు, పేరూరు, ధర్మవరం, వెంకటాపురం(కె) మండలం నుంచి విద్యార్థులు కళాశాలకు వస్తున్నట్లు తెలిపారు. కళాశాల సమయంలో బస్సు సౌకర్యం లేక పేద, మధ్య తరగతి విద్యార్థులు ప్రైవేట్ వాహనాల ద్వారా వందలాది రూపాయలను ఖర్చు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కళాశాల సమయానుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని సాయి కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అన్వేష్, బ్యూల, చందన, సురేంద్ర, రాజు, నవీన్ ఉన్నారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

కన్నాయిగూడెం: మండలంలోని చింతగూడెం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రూ.30 వేల విలువ చేసే వాటర్‌ప్లాంట్‌ను సొంత ఖర్చుతో ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. పర్వతాల సతీష్ కుమార్, నర్సింహారావు, లావణ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం దందా!

- డీలర్ల నుంచే సేకరిస్తున్న దళారులు
- మండలంలోని ఓ మిల్లుకు తరలింపు?
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం (ఫైల్)

చిట్యాల: మండలంలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మూడు నెలల సన్న బియ్యం ఒకేసారి ఇచ్చింది. అలాగే ఈ నెల ఒక్కొక్క లబ్ధిదారుడికి ఆరు కిలోల సన్న బియ్యం ఇస్తోంది. ఇదే అదనుగా చేసుకుంటున్న బియ్యం అక్రమ వ్యాపారులు గ్రామాల్లో కొంత మందిని పైలెట్‌గా పెట్టుకుని నిఘా అధికారులు ఉన్నారా అని ఆరా తీసుకుంటూ బియ్యం వ్యాపారికి సమాచారం అందిస్తూ సన్నబియ్యం దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు గ్రామాల్లోని లబ్ధిదారుల వద్ద నుంచి సన్న బియ్యం కిలో బియ్యానికి రూ.20 మధ్య దళారి తీసుకొని, బియ్యం వ్యాపారికి రూ.25 చొప్పున అమ్ముకుంటున్నట్లు సమాచారం. ఆ బియ్యం వ్యాపారి గ్రామాల్లో ఉన్న బియ్యాన్ని ఒక చోట సమకూర్చుకుని వాటిని ఒకేసారి వాహనంలో లోడు చేసుకుని మండలంలోని ఓ రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు తెలిసింది.

అధికారులకు తెలిసిన అంతే?

జిల్లా, మండల పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులకు సన్న బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని తెలిసిన ఏమి తెలియనట్లు చూస్తుండటం ఏంటని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం వ్యాపారులు సంబంధిత అధికారులకు రూ.లక్షల్లో ముడుపులు చెల్లిస్తున్నారని అందుకే ఏమి తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని అనేక మార్లు పత్రికలలో వచ్చిన, అధికారులకు సమాచారం ఇచ్చిన కనీసం ఏ అధికారి స్పందించి పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీలర్ల వద్దనే దళారుల కొనుగోలు

కొంతమంది లబ్ధిదారుల నుంచి రేషన్ షాపుల వద్దనే డీలర్లు బియ్యాన్ని కొనుగోలు చేసి దళారులకు విక్రయిస్తున్నట్లు సమాచారం. దళారి లబ్ధిదారు వలే బియ్యం తీసుకుని అక్రమంగా పోగు చేసుకుంటు రాత్రి వేళలలో సరఫరా చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు రేషన్ షాపుల వద్ద తనిఖీ చేస్తేనే ఈ తతంగం అంతా బయట పడుతుందని ప్రజలు తెలుపుతున్నారు. ఇంత జరుగుతున్న ఏమి పట్టనట్లు అధికారులు చూడడం ఏంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రేషన్ సన్న బియ్యం పక్కదారి పట్టకుండా దళారి దందాను ఆపాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అటవీశాఖ అమరుల సేవలు మరువలేనివి


ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

- రేంజ్ అటవీశాఖ అధికారి వెంకటేశ్వరరావు

కాటారం: అటవిశాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలు చిరస్మరణీయంగా మిగిలిపోతాయని పెగడపల్లి రేంజ్ అటవీశాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కాటారం మండల కేంద్రంలోని అటవీశాఖ కాంప్లెక్స్ కార్యాలయంలో గురువారం అటవీశాఖ అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కాటారం, పెగడపల్లి రేంజ్ అటవీశాఖ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. వారి సేవలు మరవలేనివి అని కొనియాడారు. అనంతరం రేంజ్ కాంప్లెక్స్ నుంచి చింతకాని క్రాస్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఆర్ఓలు సురేందర్, శ్రీనివాస్, లతీఫ్‌హుస్సేన్, సెక్షన్ అధికారులు అర్చన, చంద్రశేఖర్, లక్ష్మన్‌రావు, సంతోష్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో అటవీ అమరువీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎఫ్‌డీఓ సందీప్‌రెడ్డి, రేంజర్ రవికుమార్ ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పంటల పరిశీలన


పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త విజయభాస్కర్

చిట్యాల: మండలంలోని కై లాపూర్, ఏలేటిరామయ్యపల్లి గ్రామాల్లో పత్తి, మిర్చి, వరి పంట పొలాలను వరంగల్ సీనియర్ శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.విజయభాస్కర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వడ, తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాముల నీటిలో కలిపి మొక్క మొదలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కాయకుళ్లు నివారణకు కాఫర్ ఆక్సిక్లోరైడ్ 30గ్రా., 1గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ పది లీటర్ల నీటిలో పిచికారీ చేయాలని తెలిపారు. పత్తి గులాబీ రంగు పురుగు నివారణకు ఏకరానికి ఆరు నుంచి ఎనిమిది లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే రసం పీల్చే పురుగుల నివారణకు వేప నూనె 1500 పీపీఎం ఎకరానికి లీటర్ మందు చొప్పున, లేదా ఆసీఫేట్ ఏకరానికి 300 గ్రాముల చొప్పున లేదా ఫ్లునికామైడ్ 0.25 మి.లీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఆశించడం జరిగిందని పురుగు నివారణకు క్లోరాంట్రనిలిప్రోలు 0.3 మి.లీ చొప్పున లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేయాలని అన్నారు. శాస్త్రవేత్తలు డా.వెంకట రాజ్‌కుమార్, డా.ఆర్ విశ్వతేజ, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి కుమారస్వామి


మాట్లాడుతున్న కుమారస్వామి

కాటారం: వర్షాకాలంలో పశువులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి సకాలంలో వైద్యం అందించాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కుమారస్వామి తెలిపారు. కాటారం మండలం ఒడిపిలవంచ, ధన్వాడ, దామెరకుంట పశువైద్యశాలలను పశువైద్యాధికారి కుమారస్వామి గురువారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉప కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మందుల స్టాక్, రోగాల నివారణ టీకాలు, రిజిస్టర్లను పరిశీలించారు. దామెరకుంటలో గొర్లకాపర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గొర్లకు మేత సరిగా దొరకడం లేదని అటవీ ప్రాంతంలోకి వెళ్తే అధికారులు రానివ్వడం లేదని, మేత పెంపకానికి ప్రత్యేక స్థలం కేటాయించాలని గొర్లకాపర్లు జిల్లా పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గొర్రెలు, మేకలలో పుర్రు రోగం నివారణ టీకాలు అందుబాటులో ఉన్నాయని పోషకులు గమనించాలని సూచించారు. రైతులకు పశువులకు రోగాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి అవగాహన కల్పించారు. జిల్లా పశువైద్యాధికారి వెంట మండల పశు వైద్యాధికారి రమేశ్ ఉన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న నాయకులు

కాళేశ్వరం: పెండింగ్‌లో ఉన్న ఫీజురియంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ మహదేవపూర్ మండల కార్యదర్శి పేట సాయి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. సాయికిరణ్, మణికంఠ, వరుణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- మండల ప్రత్యేకాధికారి సునీల్ కుమార్


కూరగాయలను పరిశీలిస్తున్న సునీల్

రేగొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సునీల్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని ఎంజేపీ బాలుర గురుకులాన్ని తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించారు. నిత్యావసర సరుకులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

రోడ్డుపై దిగబడుతున్న లారీలు


పాలంపేట రహదారిపై దిగబడిన లారీ

వెంకటాపురం(ఎం): మండలంలోని పాలంపేట పరిధిలోని ప్రధాన రహదారిపై నిత్యం లారీలు దిగబడుతున్నాయి. బుధవారం రాత్రి ఏటూరునాగారం నుంచి భూపాలపల్లికి కర్రలోడుతో వెళ్తున్న లారీ దిగబడింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగడంతో జేసీబీ సహాయంతో లారీని బయటకు తీశారు. నాలుగు రోజుల్లో మూడు లారీలు దిగబడడంతో రోడ్డు గంతలు పడి ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై గాయపడుతున్నారు. గత నెలలో మల్లంపల్లి వద్ద బ్రిడ్జి కూలడంతో ఇసుక లారీలను పాలంపేట మీదుగా దారి మళ్లిచారు. దీంతో ఇసుక లారీల రాకపోకల వల్ల జంగాలపల్లి నుంచి గాంధీనగర్ వరకు రోడ్డు తీవ్రంగా దెబ్బతినడంతో పాటు పాలంపేట పరిధిలో పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ప్రపంచ వారసత్వ కట్టడమైనా రామప్ప ఆలయానికి ప్రతిరోజు వందలాది సంఖ్యలో వస్తున్న పర్యాటకులు రామప్ప రహదారిని చూసి ఆందోళనకు గురవుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


భూపాలపల్లి రూరల్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్/గణపురం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండలంతో పాటు గణపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మీతో రూ.390 లక్షల వ్యయంతో గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ నుంచి పెద్దాపూర్, ఎస్ఎం కొత్తపల్లి నుంచి దొమ్మటిపల్లి చెరువు, గొర్లవీడు గ్రామంలో జెడ్పీ రోడ్డు నుంచి మల్లయ్యపల్లి వరకు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే గణపురం మండలం రంగారావుపల్లి నుంచి దశరథం తండా, వీర్లపల్లి(బంగ్లాపల్లి) నుంచి చక్రవర్తిపల్లి, బంగ్లాపల్లి ఎస్సీ కాలనీ నుంచిమామిడి తోట, సీతారాంపూర్ నుంచి కొండాపూర్, అప్పయ్యపల్లి తూపురం నుంచి కొండంపల్లి, గణపురం చీరలపల్లి చింతల నుంచి లబ్బుదండ వాగు వరకు వ్యవసాయ పొలాలకు వెళ్లే అంతర్గత రోడ్ల నిర్మాణపనులకు ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు ఇతర పథకాల ద్వారా కూడా రహదారి పనులు చేప ట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే అన్నారు. భూపాలపల్లి మండలం గొర్లవీడు గ్రామంలో గ్రామ దాతల సహకారంతో సుమారు రూ.2 లక్షల 50 వేల వ్యయంతో 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, నిందితులను తొందరగా పట్టుకునేందుకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యే అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తా..

భూపాలపల్లి రూరల్: పట్టణంలో భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటుకు పూర్తిగా సహకరిస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఉద్యోగుల సంఘం భవన్‌లో సగర(ఉప్పర) కులస్తుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూపాలపల్లిలో భగీరథ మహర్షి విగ్రహ ఏర్పాటు చేయడానికి తాను పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని తెలిపారు. భగీరథ మహర్షి గంగను భూమిపైకి తీసుకువచ్చి ప్రజలకు అందించిన మహనీయుడని అన్నారు. అనంతరం సగర సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొడెం వంశీకి అభినందన

- అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటి గ్రామానికి వచ్చిన వంశీ



వాజేడు: ఏజెన్సీలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే మొడెం వంశీ అనే యువకుడు ఆగస్టు నెలలో ఉత్తర అమెరికాలోని కోస్టారికాలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. పోటీలు ముగిసిన అనంతరం స్వగ్రామమైన మండల పరిధిలోని ఇప్పగూడెం గురువారం వచ్చాడు. మూడు రోజుల పాటు స్వగ్రామంలోనే ఉండనున్నట్లు తెలిపాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండతో మరిన్ని పతకాలను తీసుకువస్తానని తెలిపాడు. మొడెం వంశీ స్వగ్రామానికి వచ్చిన విషయం తెలుసుకున్న పలువురు కలిసి అభినందించారు.

న్యాయం చేయాలని నిరసన


పాపతో కలిసి నిరసన తెలుపుతున్న రమ్య

భూపాలపల్లి రూరల్: తనకు, తన కూతురుకు న్యాయం చేయాలని జిల్లా కేంద్రంలో అల్లి రమ్య ఆమె భర్త ఇంటి ఎదుట గురువారం నిరసన తెలిపారు. కాగా, రమ్యకు పలు మహిళా సంఘం సభ్యులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ.. పట్టణంలోని సుభాస్‌కాలనీకి చెందిన అల్లి సంతోష్‌కు తనకు 2017లో పెళ్లి అయిందన్నారు. పెళ్లి అయిన సంవత్సరం తర్వాత వేదింపులకు గురిచేశాడని వాపోయింది. అంతేకాకుండా వేరే అమ్మాయితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని ఆరోపించింది. ప్రశ్నించిన తనను చున్నీతో ఒకసారి ఉరివేసి చంపేయడానికి ప్రయత్నించాడని తెలిపింది. అక్రమ సంబంధం వల్లనే అనేక చిత్రహింసలకు గురిచేయడంతో 2023 మార్చిలో తన భర్త ఇంటి ముందు నిరసన తెలిపినట్లు పేర్కొంది. దీంతో పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. కాగా, కొద్ది రోజులు కాపురానికి తీసుకెళ్లి చిత్ర హింసలకు గురిచేశాడని దీంతో తల్లిగారివద్దనే ఉంటున్నట్లు తెలిపారు. చిన్న పాపతో పాటు తనకు న్యాయం జరిగే వరకు ఇంటి నుంచి ఎక్కడికి కదిలేది లేదని తెలిపారు. ఈ విషయమై భర్త అల్లి సంతోష్‌ను సంప్రదించగా ఆమె తనపై హత్యా ప్రయత్నం చేసిందని ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు.

రవినాయక్‌ను కలిసిన సురేందర్


రవినాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సురేందర్

ములుగు రూరల్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికై న నేతావత్ రవినాయక్‌ను గురువారం హైదరాబాద్‌లో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు రవినాయక్‌ను శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట విష్ణువర్ధన్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు


ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి మిత్రులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన కొండా రాజేశ్వర్ తండ్రి ధర్మయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బుగులోని వెంకటేశ్వరస్వామి ఆటో యూనియన్ సభ్యులు పరామర్శించి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు సాంబయ్య, ఉపాధ్యక్షుడు భిక్షపతి, కోశాధికారి కమలాకర్, సభ్యులు ఉన్నారు.

నారాయణపురంలో..

మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన క్యాతం విజేందర్ ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. దీంతో విజేందర్‌ను అతడి ఇంటర్మీడియట్ మిత్రులు పరామర్శించి, రూ.9 వేలు ఆర్థిక సాయం అందజేశా రు. ఈ కార్యక్రమంలో స్నేహితులు పెంబర్తి వి జయ్, మద్దెల జీవన్, బర్ల అశోక్ పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఏఎన్ఎస్, ఏవీఎస్‌పీ, తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆ సంఘాల నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమంగా ఏజెన్సీలో లబాడీలు చొరబడి ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. అప్పటి ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు లేకుండా ఓటు బ్యాంకు రాజకీయంతో లంబాడీలను ఎస్టీలుగా పరిగణించడంతో వారు ఏజెన్సీలో తిరుగుతున్నారన్నారు. వీరిని వెంటనే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మొడెం నాగరాజు, బోదెబోయిన సురేష్, చేప లక్ష్మణ్, చింత కార్తీక్, సంతోష్, హరినాథ్, రవి, సోమరాజు తదితరులు ఉన్నారు.